క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: మరమ్మతుల కారణంగా అంకుషాపూర్, కొండాపూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. అవుషాపూర్, ఎస్పీఆర్, ఆరోరా, అనురాగ్ కళాశాల, కేపాల్ ప్రాంతంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అత్వెల్లి శివాలయంలో మండల పూజలు



పూజల్లో టీపీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయంలో మండల పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రెండో వార్డు కౌన్సిలర్ సరిత మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకలో భక్తులతో పాటు టీపీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

వైఎస్సార్‌టీపీ మండల పార్టీ కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రం అందజేస్తున్న డానియల్

మేడ్చల్: వైఎస్సార్‌టీపీ మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులను ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పాకాల డానియల్ ప్రకటించారు. అధ్యక్షుడిగా భూర్పు వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా అగ్రారం రవిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రాలను చెక్ పోస్ట్ వద్ద గల వైఎస్ విగ్రహం వద్ద అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రైతు విభాగం కోఆర్డినేటర్ వడ్డెపల్లి యాదిరెడ్డి, మూడు చింతపలపల్లి మండల కోఆర్డినేటర్ కవాడి ప్రకాష్, నాయకులు శ్రీను, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

మేడ్చల్: పద్మశ్రీ అవార్డు పొందిన రాష్ట్రానికి చెందిన డాక్టర్ పి.హన్మంత్‌రావును మండల బీఆర్‌ఎస్ నాయకులు నగరంలోని ఆయన నివాసంలో కలిసి శుక్రవారం సన్మానించారు. ఆయన్ను కలిసిన వారిలో మండల బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్, నాయకురాలు నవనీత తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

జవహర్‌నగర్: పోషణ పక్షంను పురస్కరించుకొని జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్ జయ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం, చిరుధాన్యాలు తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని, రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ పిల్లలకు బలవర్ధకమైన ఆహారం అందిస్తోందని, బాల్యం నుంచే మంచి ఆహారపు అలవాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు వనజాక్షి, మనోహర, సరస్వతి, అనురాధ, రజిత, మనిషా తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఘట్‌కేసర్: కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఘనాపూర్‌లో బీజేఆర్ విగ్రహం నుంచి ప్రాథమిక పాఠశాల వరకు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు భాస్కర్, పద్మ, మయూరి, కాంతమ్మ, పవన్, శోభ, కోఆప్షన్ సభ్యులు అన్నారెడ్డి, సురేశ్, నాయకులు కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ రూప్‌సింగ్, మాజీ ఉప సర్పంచ్ సత్తయ్యగౌడ్ స్థానికులు పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన

ఘట్‌కేసర్: ప్రతాపసింగారం గుబ్బరిగుట్ట మైసమ్మ, ఎల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, పీర్జాదిగూడ మేయర్ వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దయాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, చైర్ పర్సన్ ప్రణీతగౌడ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచులు శివశంకర్, వెంకటేశ్‌గౌడ్, రమాదేవి, కొండల్‌రెడ్డి, అంజిరెడ్డి, కీసరగుట్ట డైరెక్టర్ నరేశ్‌గౌడ్, కుమార్, నర్సింహా పాల్గొన్నారు.




పూజల్లో మంత్రి మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సమ్మేళనాలతో విభేదాలు సమసిపోయేనా..!

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బీఆర్‌ఎస్ బలోపేతమే లక్ష్యంగా సమ్మేళనాలు

- రానున్న ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమంపై ప్రజల్లో ప్రచారం
- నెల రోజుల కార్యాచరణ ఖరారు చేసిన పార్టీ నాయకులు
- జిల్లా సమన్వయ కర్తగా, ఎమ్మెల్సీ, రైతు బంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- మంత్రి, ఎమ్మెల్యేలు, నాయకుల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలపై కేడర్‌లో చర్చ

సాక్షి, మేడ్చల్ జిల్లా: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) కార్యకర్తలందర్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు ఆత్మీయ సమ్మేళనాలకు శ్రీకారం చుడుతోంది. దాదాపు నెల రోజుల పాటు జరిగే సమ్మేళనాల్లో ప్రభుత్వ పథకాలపై ప్రచారం కల్పించడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలని భావిస్తోంది. ఇందుకోసం పార్టీ శ్రేణులను సమన్వయ పరిచేందుకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజుతో కలిసి జిల్లాకు సమన్వయకర్తగా అధిష్ఠానం నియమించిన ఎమ్మెల్సీ, రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి పార్టీ కార్యకర్తలను ప్రజల్లోకి పంపించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను ప్రజలకు వివరించే కార్యక్రమంలో కార్యకర్తలందరిని భాగస్వాములను చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన పథకాల వివరాలను ప్రజలకు వివరించాలని అధిష్ఠానం ఆదేశించింది. ఇందు కోసం కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం పేరిట గ్రామాల్లో, పురపాలక సంఘాల్లో డివిజన్లు/వార్డుల్లో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు, సర్పంచి, ఎంపీటీసీ సభ్యులు, రైతుబంధు కన్వీనర్, సింగిల్ విండో చైర్మన్లతో పాటు జడ్పీటీసీ, ఎంపీపీ, మండల పార్టీ కార్యవర్గం, అనుబంధ సంఘాలు, కార్పొరేషన్ చైర్మన్లు అందరితో ఈ సమావేశం నిర్వహించనున్నారు. సంబంధిత నియోజకవర్గ ఇన్‌చార్జి ఉండే ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ, జడ్పీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, ఇతర పదవులున్న నేతలందరినీ ఆహ్వానిస్తారు. పురపాలక సంఘాల్లో కార్పొరేటర్/కౌన్సిలర్, పార్టీ వార్డు అధ్యక్షుడు ఇతర కార్యవర్గాన్ని భాగస్వామ్యం చేస్తారు. మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు సమావేశాల్లో పాల్గొనేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.



నెల రోజుల పాటు బీఆర్‌ఎస్ సమ్మేళనాలు

గ్రామ కార్యకర్తల సమ్మేళనం ఏ తేదీన నిర్వహిస్తారో నియోజకవర్గ ఎమ్మెల్యే నిర్ణయించాల్సి ఉంటుంది. వివరాలను పార్టీ జిల్లా ఇన్‌చార్జి లేదా సమన్వయకర్తకు అందజేస్తే అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలకనుగుణంగా సమావేశాలు నిర్వహిస్తారు. ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 24వ తేదీలోగా ఈ సమ్మేళనాలు పూర్తిచేయాలి. అనంతరం 25న గ్రామాల్లో, వార్డుల్లో పార్టీ జెండాలు ఎగురవేసి పండగ వాతావరణం తలపించేలా కార్యక్రమం చేపట్టాలని సూచనలు ఉన్నాయి. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా సచివాలయం ఎదుట 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనుండటంతో జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలు ఉత్సవాలు నిర్వహించనున్నారు. కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాల విజయవంతం కోసం పార్టీ జిల్లా సమన్వయ కర్త ఇక్కడకు చేరుకుని నేతలకు దిశా నిర్దేశం చేస్తారు. పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం పటిష్టపరచడంపైనా దృష్టిపెడుతారు. సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను ఇందులో చేర్పించనున్నారు. ప్రస్తుతం పరీక్షల కాలం కావడంతో జూన్ నెలలోనే విద్యార్థి విభాగాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

సమ్మేళనాలు ఇలా..

పది గ్రామాలను కలిపి ఒక సమ్మేళనం ఏర్పాటు చేస్తారు. పట్టణాల్లో 3 నుంచి 4 వార్డులను కలిపి ఓ సమ్మేళనం ఉంటుంది. గ్రామాల నుంచి వచ్చే కార్యకర్తలకు అక్కడ చేపట్టిన అభివృద్ధిని గణాంకాలతో సహా వివరిస్తారు. పథకాలతో లబ్ధిపొందిన వారి జాబితాను అందిస్తారు. ఆ వివరాలతో కార్యకర్తలు కలిసికట్టుగా పర్యటిస్తూ.. ప్రభుత్వం గ్రామానికి ఏం చేసింది? ఎన్ని నిధులతో పనులు జరిగాయి? ఎందరు లబ్ధి పొందారో వివరించి ప్రజలను ఆకట్టుకునేలా చేయడం ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోంది.

విభేదాలు సమసి.. సమన్వయం జరిగేనా..!

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బీఆర్‌ఎస్ నేతల మధ్య అంతర్గంగా కొనసాగుతున్న విభేదాలు.. త్వరలో జరిగే విస్తృత సమ్మేళనాలతో సమసి పోగలవా .. లేక మరింత ముదురుతాయన్న చర్చ పార్టీ వర్గాలను వేధిస్తోంది. మంత్రి మల్లారెడ్డిపై జిల్లాకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయగా, ఇంత వరకు ఇది ఓ కొలిక్కివచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. కొద్ది రోజుల కిందట మల్కాజిగిరి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నేత హన్మంతరావు ఇంట్లో సమావేశమైన జిల్లా పార్టీకి చెందిన 5 ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి నిధుల విషయంలో మంత్రి మల్లారెడ్డి జోక్యాన్ని తప్పుపట్టారు. ఈ వ్యవహారాలపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తమని, 5 ఎమ్మెల్యేలు ఆ సందర్భంగా ప్రకటించారు. అలాగే, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆదేశాలను ఖాతర్ చేయకుండా నామినేటెడ్ పదవులను మంత్రి మల్లారెడ్డి సొంత నియోజకవర్గం వారికి కట్టబెట్టారని ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ వ్యవహారం ఇంకా చక్కబడకపోవడంతో విభేదాలు కొనసాగుతూనే.. ఉన్నాయి. అలాగే మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డి వర్సెస్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఉప్పల్‌లో ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మాజీ మేయరు బొంతు రామ్మోహన్, కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే వివేకానందగౌడ్, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు మధ్య విభేదాలు తారస్థాయిలో ఉన్నట్లు కేడర్‌లో చర్చ సాగుతోంది. కూకట్‌పల్లిలో కూడా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరు తమ వర్గాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని 13 పురపాలక సంఘాలోలో అధికార పార్టీ మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఉన్నప్పటికీ వారి మధ్యనే ఉన్న విభేదాలు వచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా కొనసాగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని డివిజన్లతో సహా పలు గ్రామాల్లో కూడా పార్టీ ప్రజా ప్రతినిధుల మధ్య అంతర్గత విభేదాలు చాపకింద నీరులా కొనసాగుతున్నాయి. అయితే.. పార్టీ విస్తృత సమ్మేళనాలతో బీఆర్‌ఎస్ నేతల మధ్య నెలకొని ఉన్న విభేదాలు సమసిపోతాయా.. లేక భగ్గుమంటాయా.. అన్న ఆందోళన కేడర్ నుంచి వ్యక్తమవుతుండగా, దీన్ని జిల్లా సమన్వయకర్త, పార్టీ యంత్రాంగం ఎలా ఎదుర్కొని చల్ల బర్చగలదో వేచి చాడాల్సిందే మరి.

కనుల పండువగా ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవం



విగ్రహ పునః ప్రతిష్ఠాపనలో మంత్రి మల్లారెడ్డి





సీతారామచంద్రుల శాంతి కల్యాణోత్సవం

కీసర: గ్రామస్తులంతా సమిష్టిగా ముందుకొచ్చి కీసరలో శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయాన్ని పునః నిర్మించుకోవడం చాలా సంతోషించదగ్గ విషయమని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కీసరలో సీతారామచంద్ర స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన శుక్రవారం ఆలయంలో వేదపండితులు విశేష పూజలను నిర్వహించారు. యంత్ర ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, మూర్తిప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, మహాపూజ, బలిహరణం, పూర్ణాహుతి, శాంతికల్యాణంను నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో కీసర గ్రామమంతా రామనామ స్మరణతో మార్మోగింది. ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర నేత కొంపల్లిమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నేత సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తదితరులు ఈ ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాయకపు వెంకటేష్, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, సర్పంచ్ నాయకపు మాధురి, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ టి.నారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం



పోషణపక్షం కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులతో పాటు వారి తల్లులకు పౌష్టికాహారాన్ని అందజేస్తోందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ విజయపురి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా (మిల్లెట్స్) చిరుధాన్యాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పిల్లలు, వారి తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనితాసుధాకర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్స్ రజని, రమా, అనురాధ, సునీత, స్వరూప, మహేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ చాముండిదేవి, ఆశ వర్కర్స్ వాణి, సరిత, ఎస్‌జీహెచ్ సరిత, కాలనీవాసులు కొత్త గోపాల్‌రెడ్డి, సత్యంరాజు, శ్రీనివాస్, సోమరాజు, రమేష్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సెయింట్ పీటర్స్' విద్యార్థులకు జాతీయ స్థాయి ప్రథమ బహుమతి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి హ్యాకథాన్ పోటీల్లో సత్తాచాటి ప్రథమ బహుమతి సాధించారు. ఈ నెల 18న భువనేశ్వర్‌లో జాతీయ స్థాయిలో జరిగిన స్టార్టప్ కాన్‌క్లేవ్ సందర్భంగా అంత్ర హ్యాకథాన్ 2023 నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల అగ్రి–ఏ1 బృందం విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ విభాగం నుంచి స్టార్టప్ కాన్‌క్లేవ్‌లో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల సెక్రెటరీ టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్ సరోజరెడ్డి, అనురాగ్‌రెడ్డి, హెచ్ఓడీ హర్షరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సెక్రెటరీ, అధ్యాపకులు

'స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన ఘనత కేసీఆర్‌దే..'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: తెలంగాణలో నిధులివ్వకుండా స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్పంచులకు చేయవలసింది సన్మానం కాదని, పగలు, రాత్రి అనక నిధులు ఇవ్వకున్నా అప్పులు చేసి గ్రామాలను నడిపిస్తున్న సర్పంచుల కాళ్లు మొక్కాలన్నారు. అప్పులు చేసి తిరిగి చెల్లించలేక తెలంగాణలో సుమారు 70 మంది సర్పంచులు మృతి చెందారని, ఇప్పటికైన బుద్ధి తెచ్చుకొని స్థానిక సంస్థలకు నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమలో ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, శోభారాణి పాల్గొన్నారు.

తెలంగాణలో అంధత్వ నివారణే లక్ష్యం

ఘట్‌కేసర్: కంటి సమస్యలు ఉన్న వారు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని 15వ కమిషనర్ వేమనరెడ్డి, స్థానిక కౌన్సిలర్ నరేశ్‌యాదవ్‌తో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రేయ, ఆప్తమాలజిస్ట్ శిరీష, డీఈఓ సాత్విక్, ప్రసాద్, విజయ, రాజేశ్వరీ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్, కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్ నరేశ్‌యాదవ్

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్టు

జవహర్‌నగర్: బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిని జవహర్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 18వ తేదీన పాఠశాలకు వెళ్లిన బాలిక(14) మధ్యాహ్నం ఇంటికి వచ్చి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. బాలిక అదృశ్యమైందని ఇంటికి సమీపంలో ఉంటున్న సుధాకర్ అనే వ్యక్తిపై అనుమానం ఉందని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఈ నెల 23వ తేదీన జవహర్‌నగర్ చెన్నాపురం పరిధిలో సుధాకర్ అతడితో పాటు బాలికను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుధాకర్ బాలికకు మాయమాటలు చెప్పి విజయవాడ, శ్రీశైలం వెళ్లినట్లు గుర్తించారు. నిందితుడు సుధాకర్‌పై కిడ్నాప్ కేసుతో పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మేడ్చల్‌లో ఏసీబీ అధికారుల సోదాలు

- లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సంగారెడ్డి డీఈఓ రాజేష్
- మేడ్చల్‌లోని తన నివాసంలోనూ తనిఖీలు

మేడ్చల్: ప్రైవేటు పాఠశాలకు ఎన్‌ఓసీ సర్టిఫికెట్ జారీ చేసేందుకు డబ్బులు డిమాండ్ చేసి రూ.50 వేలు లంచం తీసుకుంటూ సంగారెడ్డి డీఈఓ రాజేష్ శుక్రవారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. దీంతో ఏసీబీ అధికారులు డీఈఓ ఆస్తులపై ఆరా తీశారు. మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్ రోడ్ నంబర్.7లో ఉన్న రాజేష్ ఇంటికి శుక్రవారం సాయంత్రం చేరుకున్న అధికారులు ఆయన ఇంట్లో సోదాలు చేపట్టి పలు డాక్యుమెంట్లు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ తనిఖీల సందర్భంగా స్థానిక మేడ్చల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



మేడ్చల్‌లో ఉన్న సంగారెడ్డి డీఈఓ రాజేష్ ఇంటి వద్ద ఏసీబీ అధికారులు

ఒకటవ తేదీనే వేతనాలు చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట వివిధ సంఘాల ఉపాధ్యాయుల నిరసన

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రతీ నెల ఒకటవ తేదీన చెల్లించాల్సిన వేతనాలు 15వ తేదీ వరకు అందజేయక పోగా.. ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూడాల్సి వస్తోందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం కమిటీ జిల్లా ప్రతినిధులు కలెక్టరేట్ వద్ద వివిధ ఉపాధ్యాయ సంఘాలకు చెందిన టీచర్లు నిరసన తెలపడంతో పాటు జిల్లా ట్రెజరీ అధికారి నర్సింహాలుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, దీంతో వారి కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఉపాధ్యాయుల సప్లిమెంటరీ వేతనాలు, పీఆర్సీ బకాయిలు, సెలవు వేతనాలు, పెన్షనరీ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, టీఎస్‌జీఎల్ఐ, జీపీఎఫ్ క్లెయిములు తదితర బిల్లులన్నీ ట్రెజరీల్లో ఆమోదం పొందినప్పటికీ, ఏడు నెలలుగా సంబంధిత ఉపాధ్యాయుల ఖాతాల్లో నిధులు జమ కాలేదన్నారు. మరికొన్ని బిల్లులు సంవత్సరానికిపైగా పెండింగ్‌లో ఉన్నాయని, ఇంకో వారం రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో వెంటనే బిల్లులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎయిడెడ్ టీచర్ల వేతనాలు, పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయాలని పోరాట కమిటీ డిమాండ్ చేస్తూ యూఎస్పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ట్రెజరీ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ నిరసనలో జిల్లా స్టీరింగ్ కమిటీ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు బ్రహ్మచారి, తిరుపతి, రాకేష్, హరిచంద్, కవిధర్, కరుణాకర్, రేణుక, సుజాత, పురుషోత్తం, శ్రీనివాస్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



డీటీఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

కంటివెలుగు శిబిరం ప్రారంభం



కంటివెలుగును ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: కంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులోని విజయపురి కాలనీ వెల్ఫేర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కౌన్సిలర్ అనితాసుధాకర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

మేడ్చల్‌రూరల్/శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. గ్రామానికి చెందిన శ్రవంత్‌రెడ్డి తన తండ్రి దేవేందర్‌రెడ్డి జ్ఞాపకార్థం ప్రతీ ఏడాది మాదిరి శుక్రవారం స్థానిక కౌన్సిలర్ నర్సింగ్‌రావు గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్‌రెడ్డిలతో కలిసి విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం స్వరూపరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సంక్షేమ పాలనలో తెలంగాణే నంబర్ వన్

మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: సంక్షేమ పాలనలో దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్‌కు కేంద్రం ఎంపిక చేసిన పంచాయతీల సర్పంచులకు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి అవార్డులు, ప్రశంసా పత్రాలను శుక్రవారం మంత్రి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ దయాకర్‌రెడ్డి, ఎంపీడీఓ అరుణారెడ్డి, నాయబ్ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంపీఓ నందకిశోర్, సర్పంచులు కావేరి, గీత, జలజ, రమాదేవి, మంగమ్మ, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, యాదగిరి, వెంకట్‌రెకడ్డి, సురేశ్, ఎంపీటీసీలు శోభారాణి, వినోద, భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచులు రాజముదిరాజ్, ఐలయ్యయాదవ్, అధికారులు పద్మిని, బాసిత్, శశిధర్ పాల్గొన్నారు.



సర్పంచ్‌లు గీత, గోపాల్‌రెడ్డికి అవార్డులు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఆర్‌ఎంసీ ప్లాంట్‌ను తనిఖీ చేసిన పీసీబీ అధికారులు

పోచారం: నారపల్లిలోని శ్రీరాంనగర్ కాలనీ సమీపాన నిర్మిస్తున్న రెడీ మిక్స్‌డ్ కాంక్రీట్ (ఆర్‌ఎంసీ) ప్లాంట్‌ను కాలుష్య నియంత్రణ మండలి అధికారులు శుక్రవారం పరిశీలించారు. కాలుష్యం వెదజల్లే ఆర్‌ఎంసీ ప్లాంట్ నిర్మాణాన్ని నిలిపివేయాలని శ్రీరాంనగర్ కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదుకు పీసీబీ స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్లాంట్ నిర్మాణాన్ని ఆపివేయాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేస్తామని చెప్పారు.

విద్యార్థులకు 'బ్రహ్మిగ్రాన్యుయల్స్' పంపిణీ



విద్యార్థులకు బ్రహ్మిగ్రాన్యుయల్స్ పంపిణీ చేస్తున్న వైద్యులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయుర్వేదిక్ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి బ్రహ్మి గ్రాన్యుయల్స్ పౌష్టిక పౌడర్‌ను అందజేశారు. రాగి లడ్డులను పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రతీ రోజు 5 గ్రాముల పౌడర్‌ను పాలలో కలుపుకుని తాగితే జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. వైద్యులు గాయత్రిదేవి, స్నేహలక్ష్మిలు ఆరోగ్య సూత్రాలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రంగాచారి, ఫార్మసిస్టు సంధ్యారాణి, ఉపాధ్యాయులు గోపీనాథ్, ప్రేమ్‌కుమార్, మోహన్‌కుమార్, అనిల్‌కుమార్, రాజారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 59ను సద్వినియోగం చేసుకోవాలి

ఘట్‌కేసర్: జీఓ 59ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ దస్తావేజులను నాయబ్ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ అలేఖ్యతో కలిసి శుక్రవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో ప్రభుత్వ ఉత్తర్వు 59లో దరఖాస్తు చేసుకున్న వారిలో 172 మంది అర్హులుగా తేలారని, వారంతా గడువులోపు డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ దస్తావేజులు తీసుకోవాలన్నారు.



దస్తావేజులు అందజేస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి